ప్రజాశక్తి

ఆదివారం 24 డిసెంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఒంగోలుకు

అప్పుడే వస్తా..

- ఇళ్ల స్థలాలకు నిధులిస్తేనే.. నియోజకవర్గానికి..
- పార్టీ నేతలకు అదే చెబుతున్న మాజీ మంత్రి బాలినేని
- ఆయన పుట్టినరోజు ముగిసినప్పటి నుంచీ హైదరాబాద్‌లోనే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలులో 25 వేల మందికి ఇళ్లస్థలాలు ఇచ్చాకే పోటీచేస్తామంటూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే.. కొద్దినెలలుగా ఆయన ఒంగోలులో ఇళ్లస్థలాల కోసం సేకరించిన భూములకు డబ్బుల కోసం తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నారు. సిఎం జగన్‌ను కలిసినప్పుడల్లా ఇదే విషయాన్ని ప్రధానంగా ఆయన దృష్టికి తీసుకుపోయారు. మూడు, నాలుగు నెలలుగా నిధుల కోసం ఆయన ఎదురుచూస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి. నిధులు రాలేదు. దీంతో బాలినేని తీవ్ర అసంతృప్తిగానే ఉన్నారు. అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇళ్లస్థలాలు ఇవ్వకపోతే ఎన్నికల్లో జనానికి సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తుందని ఆయన ఆందోళన చెందుతున్నారు. భూములకు సుమారు రూ.160 కోట్ల వరకూ చెల్లించాలి. అప్పుడే వాటిని రైతులు అప్పగిస్తారు. ఈ ప్రక్రియ చాలా వేగంగా నడిస్తే తప్ప ఎన్నికల నాటికి పూర్తవదు. ఇప్పుడు ఆయన హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఇళ్లస్థలాలకు డబ్బులు ఇస్తేనే ఒంగోలుకు వస్తానంటూ పార్టీ నేతలకు స్పష్టంగా ▶ 2లో

అంగన్‌వాడీల వేతనం

రూ.19 వేలకు పెంచాలి

- సిఎం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి
- డబ్బుల్లేవని చెప్పి.. వాలంటీర్లకు జీతాలు ఎలా పెంచారు?
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి
- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

యర్రగొండపాలెంలో సమ్మెశిబిరంలోనే సెమీ క్రిస్మస్ జరుపుకుంటున్న అంగన్‌వాడీలు

బాపట్లలో ఆర్టీసీ బస్సు శుభ్రం చేస్తూ.. నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-ఒంగోలు, బాపట్ల

వేతనాలు పెంచాలని అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపడుతుంటే చర్చల సమయంలో ప్రభుత్వం మా దగ్గర డబ్బులు లేవని చెప్పి నేడు వాలంటీర్లకు ఏ విధంగా వేతనాలు పెంచిందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి ప్రశ్నించారు. అంగన్‌వాడీల వేతనం రూ.19 వేలకు పెంచి సిఎం జగన్ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో అంగన్‌వాడీల సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. బాపట్లలో ప్రైవేటు, ప్రభుత్వ వాహనాలను శుభ్రం చేస్తూ.. నిరసన తెలియజేశారు. ఒంగోలులో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. కొండపి, సంతనూతలపాడుల్లో అంగన్‌వాడీ చిన్నారులు తమ టీచర్లకు జీతాలు పెంచాలని నిరసన తెలియజేశారు.

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గం చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో సమ్మె శిబిరాలను ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి సందర్శించారు. భట్టిప్రోలులో తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల శిబిరం వద్ద ఆమె మాట్లాడారు. అంగన్వాడీల వేతనాలు పెంచడానికి నిధుల్లేని ప్రభుత్వానికి లక్షన్నర నుండి రెండు లక్షల వరకు జీతాలను ఎమ్మెల్యేలకు ఎలా కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం దిగివచ్చి ▶ 2లో

భట్టిప్రోలులో శిబిరం వద్ద మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ఒంగోలులో ఒంటి కాలితో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

టీచర్లకు జీతాలు పెంచాలని కొండపిలో చిన్నారి నిరసన

వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో

ముదిరిన గ్రూపుల పోరు

- ఇన్‌ఛార్జుల ప్రకటన తర్వాత మారిపోయిన పరిస్థితి
- ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉంటున్న నాయకులు
- నియోజకవర్గాల్లో నేతల వేరుకుంపట్లు..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసిపి అధిష్టానం ఇన్‌ఛార్జులను మార్చుతూ తీసుకున్న నిర్ణయం ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇన్‌ఛార్జుల మార్పు వల్ల గ్రూపుల పోరు ముదిరే అవకాశాలున్నాయి. బాపట్ల జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో వైసిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు మొన్నటి వరకు గెలుపు, ఓటముల సంగతి ఎలా ఉన్నా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ పెద్దగా గ్రూపు గొడవలు లేకుండా తమ పనులను సాఫీగా చేసుకెళ్లేవారు. ముఖ్యంగా గడపగడపకూ ప్రభుత్వ కార్యక్రమం అనేది తాము పార్టీ టిక్కెట్‌ను దక్కించుకునేందుకు మొదటి మెట్టుగా భావించి తిరిగారు. ఎక్కువమంది నేతలు తమకు ఓపిక లేకపోయినా పార్టీ అధినేత జగన్ మాటను కాదనలేక ఇంటింటికీ వెళ్లారు. తీరా ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఇన్‌ఛార్జులుగా ఉన్నవారిని మార్చుతూ తీసుకున్న నిర్ణయం ఆయా నియోజకవర్గాల్లో గ్రూపుల పోరుకు దారి తీసింది.

అద్దంకి నియోజకవర్గంలో కొద్ది రోజుల క్రితం వరకు అక్కడ వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న బాచిన కృష్ణచైతన్యకు వ్యతిరేకంగా ఉన్న కొందరిని పార్టీ క్రమశిక్షణా చర్యల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కొత్త ఇన్‌ఛార్జిగా పాణెం హనిమిరెడ్డి రావడంతో వారందరూ ఆయన వద్దకు చేరుకున్నారు. పార్టీ తీసుకున్న ఇన్‌ఛార్జి మార్పు నిర్ణయాన్ని ఎంతమాత్రం అంగీకరించని కృష్ణచైతన్య చివరికి తానే వైసిపి తరపున అద్దంకి నుంచి పోటీలో ఉంటానని ప్రకటించారు. కొత్త ఇన్‌ఛార్జితో కలిసి ప్రయాణించేందుకు సుముఖత చూపలేదు. గురువారం పార్టీ అధిష్టానం పిలుపు మేరకు తాడేపల్లి వెళ్ళారు. పెద్దలను కలసి తన అభిప్రాయం చెప్పారు. అక్కడి పెద్దలు కొత్త ఇన్‌ఛార్జికి సహకరించాలని, మీ రాజకీయ భవిష్యత్ తాము చూసుకుంటామని చెప్పారు. పోటీ కార్యక్రమాలు వద్దన్నారు. అద్దంకిలో ఇప్పుడు సర్వే జరిపితే తమకు అనుకాలంగా సర్వే ఫలితాలు వస్తాయని కృష్ణచైతన్య పార్టీ పెద్దలకు చెప్పేందుకు యత్నించారు. కృష్ణచైతన్య కలసి రాకపోయినా నూతన ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి అద్దంకిలో వైవి సుబ్బారెడ్డి అండగా తన రాజకీయ కార్యక్రమాలు చేపట్టారు. కృష్ణచైతన్య గ్రూపులో ఉన్న మున్సిపల్ చైర్మన్, కొందరు కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇలా ఒక్కొక్కరుగా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు హనిమిరెడ్డి వైపు చేరుతున్నారు.

రేపల్లెలో వైసిపి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మోపిదేవి వెంకటరమణను తప్పించి డాక్టర్ ఈపూరు గణేష్‌ను ఇన్‌ఛార్జిగా తెచ్చారు. మోపిదేవి రాజ్యసభ సభ్యునిగా, బాపట్ల జిల్లా వైసిపి అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. రేపల్లెలో మోపిదేవికి గట్టి ▶ 2లో

చెవిలో పూలతో నిరసన

- కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

శీర్షాసనం వేసి.. నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జెఏసి జిలాల కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగుతోంది. స్థానిక కలెక్టరేట్ వద్ద జరుగుతున్న సమ్మెకు జెఏసి జదిల్లా అధ్యక్షులు ఎం.హరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నల్ల దుస్తులలో, కళ్లకు గంతలు కట్టుకుని, చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలియజేశారు. కలెక్టరేట్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కురిచేడు మండలానికి చెందిన కోటేశ్వరావురావు శీర్షాసనం వేసి నిరసన వ్యక్తం చేశారు. కనిగిరి మండలానికి చెందిన ఎస్‌కె సాబీర నాట్యం చేస్తూ.. పొన్నలూరు మండలానికి చెందిన మధుబాబు బృందం ఆటపాటలతో వారి నిరసన తెలియజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు తెలిపిన టిఎన్‌యుఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే ఈ ప్రభుత్వం నెరవేర్చి 25 వేల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు, సమ్మెకు మద్దతుగా రూ.5000 ఆర్థిక సహాయం కూడా అందజేశారు. సమ్మెకు మద్దతుగా సిపిఎస్ జిల్లా కన్వీనర్ శ్రీ సుద్దపల్లి ప్రసాద్, శ్రామిక మహిళ కన్వీనర్ పి.కల్పన, సిఐటియు ఒంగోలు పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రాంబాబు, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పారా శ్రీనివాసరావు, టిఎన్‌యసెస్ మద్దిపాడు మండలం అధ్యక్షుడు నరసింహారావు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో జెఏసి జిల్లా ప్రధాన కార్యదర్శి యు. కళ్యాణి, వివిధ మండలాల నుంచి ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనం

రూ.19 వేలకు పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు టి.కృష్ణమోహన్, సిఐటియు మండల కార్యదర్శి జి.సుధాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.మనోజ్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ భట్టిప్రోలు, వేమూరు మండలాల కార్యదర్శులు రమాదేవి, బసవమ్మ పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి..

ఒంగోలు కలెక్టరేట్: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమ్మెను పరిష్కరించాలని ఏపీ పట్టణ పౌర సంఘాల సమాఖ్య జిల్లా నాయకులు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యల సాధనకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె 12వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిలబడిన నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు పట్టణ పౌర సంఘాల సమైక్య సంపూర్ణ మద్దతు తెలియజేసింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కెవి సుబ్బమ్మ, కె.ప్రశాంతి, నిర్మల, జ్యోతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వాహనాలను శుభ్రం చేసి..

బాపట్ల: అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా వాహనాలను శుభ్రం చేసి.. యాచిస్తూ నిరసన తెలిపారు. శనివారం సమ్మె శిబిరం వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న సిఐ శ్రీనివాసులు ప్రభుత్వ పోలీసు వాహనాన్ని తుడిచి శుభ్రం చేశారు. పాత బస్టాండ్ సెంటర్లో ఆర్టీసీ బస్సులు అద్దాలు తుడిచి తమ నిరసన తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ వాహనాల వాహనాలతో పాటు ఆటోలను తుడిచి శుభ్రం చేశారు. అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజిబెత్ మాట్లాడుతూ ప్రధానంగా వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ, మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా చేయాలన్నారు. ఈ మూడూ జరిగితేనే అంగన్వాడీల సమ్మె విరమిస్తారని చెప్పారు. సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, జిల్లా కోశాధికారి భోగిరెడ్డి తిరుమలరెడ్డి, సిఐటియు నాయకులు శరత్, శామ్యూల్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గం అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు శైలశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలుకు అప్పుడే వస్తా..

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్నారు. ఆయన పుట్టినరోజు తర్వాత ఒకటీ రెండు రోజులు ఇక్కడ ఉన్నారు. తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయారు. అప్పటినుంచీ అక్కడే ఉన్నారు. రేపోమాపో పడతాయని ఎదురుచూస్తున్నారు. సోమవారం లేదా మంగళవారాల్లో పడతాయనే ఆశతో ఉన్నారు. నిధులపై సిఎం జగన్ నిర్ణయం తీసుకోవాలి. ఎందుకు జాప్యం చేస్తున్నారన్నదీ అంతు చిక్కడం లేదని పార్టీ నేతల్లో చర్చ సాగుతోంది. ఈ వ్యవహారం బాలినేని రాజకీయ భవితవ్యానికి సవాలుగా మారింది. రాజకీయంగానే ప్రాధాన్యతలపై బాలినేని కొద్దిరోజులుగా అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. టిక్కెట్ల వ్యవహారంలోగానీ, సమన్వయకర్తల మార్పుల్లోనూ ఆయన పాత్రపై చర్చ సాగుతోంది. బాలినేని ఆదేశాలు లేకుండా కొత్తగా వచ్చిన ఇన్‌ఛార్జిలకు సహకరించే ప్రసక్తే లేదని నియోజకవర్గాల్లో మండల నేతలు చెబుతున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇదే జరిగింది. ఇక బాలినేని ఎప్పుడు ఒంగోలుకు వస్తారా? అని పార్టీ నేతలు ఎదురుచూస్తున్నారు. పలువురు జిల్లా నేతలు కూడా రోజూ బాలినేనిని హైదరాబాద్‌లోనే కలుస్తున్నారు.

26న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-దర్శి: ఈ నెల 26వ తేదీన స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా జరుగుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి, కమిషనర్ వై మహేశ్వరావు తెలిపారు. మెగా జాబ్‌మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. పదో తరగతి పాసై ఇంటర్, ఐటీ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తయిన వారు ఈ మెగా జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని అన్నారు. వివరాలకు 9988853335, 9100566581 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బద్వీడులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని బద్వీడు గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టీడీపీ ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యుడు నందమూరి బాలకృష్ణలను ఒకే వేదికపై చూసిన తర్వాత వైసీపీలో ఓటమి భయం మొదలైందన్నారు. యువగళం పాదయాత్ర ముగింపు కాదని, ఇది నవశకం ప్రారంభాన్ని సూచిస్తుందని అన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి రాజభవనం తలుపులు బద్దలుకొట్టే వరకు సాగే యుద్ధమన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చెప్పినట్లుగా టీడీపీ, జనసేన పొత్తు చారిత్రాత్మకం, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ఇది చాలా అవసరం. ఈ పొత్తు 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసుకుందన్నారు. టీడీపీ, జనసేన కలిసిన రోజే వైసీపీకి ఓటమి ఖాయమైందన్నారు. అనంతరం 20 గిరిజన కుటుంబాలు టిడిపిలో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టం శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు, టిడిపి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన గిరిజన కుటుంబాలతో గూడూరి ఎరిక్షన్‌బాబు

ఇష్టంతో చదివితే ఉన్నత స్థానం సాధ్యం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఇష్టంతో చదివితే ఉన్నత స్థానాలు సాధించడం సాధ్యమవుతుందని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, యూఎస్ఏలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ముప్పాళ్ళ చంద్రశేఖర్ (చందు) అన్నారు. అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉన్నత ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పాఠశాల అవసరాల నిమిత్తం రూ.6 వేల నగదును ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావుకు అందజేశాడు. పాఠశాలకు జిరాక్స్ కం ప్రింటర్‌ను ఇవ్వనున్నట్లు, అలాగే 10వ తరగతిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.10,000 బహుమతి ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. మరో పూర్వ విద్యార్థి ఎంఆర్ శ్రీనివాసులు పాఠశాలకు సౌండ్ బాక్స్, మౌత్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్ హనుమంతరావు, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి గుంటిమడుగు కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ అద్దంకి రమణయ్య, లైబ్రరీ నర్సరాజు, పూర్వ విద్యార్థి ఎంఆర్ శ్రీనివాసులు, సిఆర్ఎంటి డివి నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ క్లాస్ విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

ముదిరిన గ్రూపుల పోరు

(మొదటిపేజీ తరువాయి)

అనుచరగణం ఉంది. వారందరూ ఆయన మాట ప్రకారం వెళతారు. పార్టీ అధిష్టానం నిర్ణయం నచ్చని మోపిదేవి అనుచరులుగా ఉన్న వైసిపికి చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు దాదాపు 150 మంది తమ పదవులకు రాజీనామాలిచ్చారు. ఇదే సమయంలో వైసిపిలో కీలక నేత, యాదవ సామాజికవర్గానికి చెందిన నిజాంపట్నం జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య టిడిపిలో చేరారు. ఇదే మండలం నుంచి పలువురు మత్స్యకార ప్రతినిధులు జనసేనలో చేరారు. వైసిపి అధిష్టానం మోపిదేవిని పక్కనపెట్టడంతో కొందరు తమ దారి తాము చూసుకుంటున్నారు. మోపిదేవి మాత్రం అధిష్టానం మాట ప్రకారం వెళ్లాల్సిందేనని చెప్పారు. తనతో ఉన్న పార్టీ నేతలకు ఆయన రాజకీయ భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో రేపల్లేలో వైసిపి నేతలది తలోదారి అయ్యింది. గతేడాది డిసెంబరు వరకు పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న రావి రామనాథం బాబును తప్పించి చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పర్చూరు ఇన్‌ఛార్జిగా నియమించారు.అప్పటి నుంచి పర్చూరులో ఉన్న వైసిపి నేతలు, ప్రజాప్రతినిధులు బాలినేని, ఎంపీ నందిగం సురేష్, ఆమంచి గ్రూపులుగా వేరు పడ్డారు. ఎవరి రాజకీయాలు వారు చేస్తూ వచ్చారు. ఆమంచి వ్యతిరేకవర్గం ఇన్‌ఛార్జ్‌ని మార్చాలని కోరుతూ సమావేశాలు పెట్టారు. రామనాథంబాబు పర్చూరు రాజకీయాలను పట్టించుకోవడం మానేశారు. జగన్ పుట్టినరోజు వేడుకలు ఆమంచి నేతృత్వంలో ఇంకొల్లులో జరిగాయి. పర్చూరులో ఆంమంచిని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న వారు అక్కడి ఎంపిపి మేకా ఆనందకుమారి ఆధ్యర్యంలో జగన్ పుట్టినరోజు వేడుకలు జరిపారు. కార్యక్రమంలో రామనాథం బాబు కుమారుడు రావి లీలాకృష్ణ పాల్గొన్నారు. సిఎం జగన్ ఆమంచిని ఏరికోరి పర్చూరు తెచ్చారు. కానీ ఇక్కడ గ్రూపులను మాత్రం కట్టడి చేయలేకపోయారు. ఈ కారణంగా పర్చూరులో వైసిపి పరిస్థితి ఎవరికి వారే యమునా తీరేలా అయ్యింది. ఈ నియోజకవర్గాల్లో వైసిపి నేతల మధ్య ఉన్న గ్రూపుల పోరు పార్టీ అభ్యర్థుల ప్రకటన.. వారికి బి ఫారాలు ఇచ్చేవరకు కొనసాగేలా ఉంది. నేతలు కూడా తమ అనుచరులకు ఇదే చెబుతూ తమ గ్రూపును కాపాడుకుంటున్నారు.

విజయసాయిని కలిసిన కదిరి

ప్రజాశక్తి-సిఎస్ పురం

వైసిపి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వి విజయసాయిరెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాస గృహంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే వైసీపీ నాయకులు కదిరి బాబురావు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. అలాగే మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస్‌రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. కనిగిరిలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నట్లు సమాచారం. బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసిన వారిలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, ప్రకాశం జిల్లా పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి పలువురు ఉన్నారు.

విజయసాయితో కదిరి

మహరాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
ఓ.యస్.నెం :21/2022
Between:-
నేరెళ్ళ వెంకట సత్యన్నారాయణ
S/o చంద్ర శేఖరరావు MGH.Colony చీరాల ...... వాది
ఎదిరి
శ్రీ బాలాజి ప్రమోటర్స్ రి.బై ప్రొప్రైటర్
కొత్తరమాదేవి w/o లేటు శ్రీరామమూర్తి ..ప్రతివాది
To
శ్రీ బాలాజి ప్రమోటర్స్ రి.బై
ప్రొ : కొత్తరమాదేవి W/o లేటు శ్రీరామమూర్తి
Flat No:1 first floor ,MGH, కాలనీ,
గాంధీనగర్ పంచాయితి, చీరాల మండలం,
బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాలో మీకు శ్రీకోర్టు వారి ద్వారాను రిజిస్టరు పోస్టు ద్వారను అనేక పర్యాయములు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వార నోటీసు జారిచేయ వలసిన దిగా పై తెలిపిన కోర్టువారు ఆర్డరు చేస్తు దావాను ది.29-01-2024 నకు వాయిదావేసినారు. కావున సదరు వాయిదా రోజున ఉదయం 10.30 లకు మీరు స్వయంగా గాని, మి తరపున్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టువారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపు కొన వలయును. లేని ఎడల సదరు దావాను మీపరొక్షమున విచారించి తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //
తేదీ : 24-12-2023

ఇట్లు
T.J.సాయిబాబు
B.కొండమ్మ
వాది తరపు న్యాయవాదులు
చీరాల, బాపట్ల జిల్లా, A-P.
Cell : 9848704919

బహిరంగ ప్రకటన

యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ అయిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, లింగసముద్రం మండలం, రాచేరువురాజు పాలెం గ్రామానికి చెందిన **చింతగుంపల రంగయ్య** కుమారుడు **రాఘవులు** గారు ఇచ్చిన సంజాయిషీ మేరకు, **నటుకుల సుబ్బారావు** మరియు **లక్ష్మీశెట్టి మృత్యుంజయ రావు** వగైరాలకు జాయింటు హక్కు గల వరికుంటపాడు గ్రామంలో నిర్మించి యుండే **శ్రీ వరసిద్ధి వినాయక కోల్డ్ స్టోరేజ్‌**లో మా క్లయింటు అయిన **చింతగుంపల రాఘవులు**కు **రూ.0.05 పైసలు** వాటా గలదు. మా క్లయింటుకు తెలియకుండా **నటుకుల సుబ్బారావు** మరియు **లక్ష్మీ శెట్టి మృత్యుంజయ రావు** వగైరాలు **శ్రీ వరసిద్ధి వినాయక కోల్డ్ స్టోరేజ్‌**ను విక్రయించడానికి ప్రయత్నం చేయుచున్నారని మా క్లయింటుకు తెలియవచ్చినది. కావున మా క్లయింటుకు తెలియకుండా **శ్రీ వరసిద్ధి వినాయక కోల్డ్ స్టోరేజ్‌**ను అమ్మిన మరియు కొనుగోలు చేసిన, మా క్లయింటు తీసుకునే సివిల్ మరియు క్రిమినల్ చర్యలుకు బాధ్యులగుదురు.

శ్రీ పెన్నా కృష్ణయ్య
శ్రీ నాదెళ్ళ యల్లమంద రావు
అడ్వకేట్స్, కందుకూరు - 523105
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

వేలంపాట ప్రకటన
గ్రామపంచాయతీ కార్యాలయం, వెల్లలచెరువు

సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామ పంచాయతీకి చెందిన ఊరచెరువు నందు చేపలు వేసి పెంచి పట్టుకొను హక్కు లీజు2 సంవత్సరములకు గాను అనగా 2023-24మరియు 2024-25 బహిరంగ వేలము గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ది:02-01-2024 ఉదయం గం:11.00లకు జరుగును. వేలంపాట నందు పాల్గొనువారు ముందుగా అనగా ఉదయం గం 10.00ల సమయం లోపు ధరావత్తుగా ఒకరు 1కి రూ 2,00,000/- చెల్లించవలెను. ధరావత్తు చెల్లించని వారు పాటనందు పాల్గొనుటకు అనర్హులు. చెరువు షరతులు అన్నియు గ్రామపంచాయతీ నందు అడిగి తెలుసుకొనగలరు. (1433 & 1434 అనగా 2023-24, 2024-25 సం.లు) మిగిలిన విషయాలు పంచాయతీ కార్యదర్శి వారిని అడిగి తెలుసు కొనవలెను. బహిరంగవేలం పాటను ఎట్టి కారణంలేకుండానే వాయిదావేయుటకు రద్దుపరుచుటకు నిర్ణయాధికారం గ్రామ పంచాయతీ వారికి కలదు.

డి.రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ వెల్లలచెరువు,
సంతమాగులూరు (మం) బాపట్ల జిల్లా
ఫోన్ : **9490450254**

ఇట్లు
షేక్ సైదాబీ, గ్రామ సర్పంచ్ వెల్లలచెరువు
సంతమాగులూరు (మం) బాపట్ల జిల్లా
ఫోన్స్ : **9848049307,9571882279**

పసిబిడ్డల కడుపు కాలుతోంది..

ప్రభుత్వం తక్షణమే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి: వ్యకాస

ప్రజాశక్తి-సంతనూతలపాడు

రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరి వల్లనే గత 12 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు అన్నారు. ఈ సమ్మెతో పసిబిడ్డల పొట్ట మాడుతున్నదని, పేద కుటుంబాల్లోని పసిబిడ్డల తల్లులు, గర్భిణులు పోషకాహారం అందక అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని బి మాచవరం, చంద్రపాలెం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల వద్ద బాలింతలు, గర్భిణులు, పసిబిడ్డలు, వారి తల్లిదండ్రులతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పసిపిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలుంటేనే తాము కూలి పనికి వెళ్లగలుగుతున్నామని, ప్రతిరోజూ బిడ్డలను అక్కడ వదిలి వెళితే తాము పని నుంచి వచ్చే వరకు తిండి, అన్ని రకాల జాగ్రత్తలు అంగన్వాడీ కార్యకర్తలు చూసేవారని తల్లిదండ్రులు చెబుతున్నారని అన్నారు. పనికి పోవాలంటే బిడ్డల పరిస్థితి ఏమవుతుందోనని ఆందోళనగా ఉందని, పేద పిల్లల పట్ల, కుటుంబాల పట్ల ప్రభుత్వం ఇలా వ్యవహరించటం అన్యాయమని వారు అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు వారి సమస్యల పరిష్కారం కోసం గత 12 రోజులుగా సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం ఇంత నిరంకుశంగా ఉండటం సరైనది కాదని గర్భిణులు, బాలింతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు, ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం మానవతా దృక్పథంతో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారు అడుగుతున్న డిమాండ్స్ పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం వారి సమ్మెను విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడటం అప్రజాస్వామికమని

నిరసన వ్యక్తం చేస్తున్న చిన్నారులు

అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు చేసే పని సచివాలయ ఉద్యోగులు కానీ, మరొకరు కానీ చేయలేరని, అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి అంగన్వాడీ కార్యకర్తలను భయపెట్టాలను కోవటం మతిమాలిన చర్య అని వారు అన్నారు. మాతృ మరణాలు, శిశు మరణాలు నివారణ కోసం ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ వల్ల కొంత మెరుగైన ఫలితాలు వచ్చాయని, దాన్ని మరింత అభివృద్ధి చేసి నిధులు కేటాయించి సమర్థవంతంగా పనిచేయించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమ్మెను పరిష్కరించాలని, వారి న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మొండి పట్టుదలతో స్పందించకపోతే అంగన్వాడీ కేంద్రాల ప్రాంతాల్లో ఉన్న పేదలందరినీ కూడగడతామని తర్వాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్నవరపు శేషారావు, దారా సుబ్బారావు, డి శ్రీనివాసరావు జె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలో ఈనెల 26వ తేదీ నుంచి సచివాలయ స్థాయిలో జరగబోయే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈవోఆర్డీ ఈదుల రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ సమావేశపు భవనంలో ఆడుదాం ఆంధ్రపై వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 21 సచివాలయాల పరిధిలో ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' అనే కార్యక్రమంలో క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు మొదటిగా సచివాలయ స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, చివరగా రాష్ట్ర స్థాయిలో జరుగుతాయని తెలిపారు. ప్రతి వాలంటీరు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ పాటికే పేర్లు నమోదు చేసుకున్న వారిని గుర్తించి ఆడుదాం ఆంధ్ర ఎక్కడ నిర్వహించేది, ఎప్పుడు నిర్వహించేది తెలియజేయాలన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ముగిస్తే వరకు పేర్లు నమోదు చేసుకున్న వారిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ పాటికే పంచాయతీ కార్యదర్శులకు అవసరమైన క్రీడా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామావత్ అరుణాబాయి, పంచాయతీ కార్యదర్శులు వెంకయ్య, సతీష్, ఉమ, పీఈటీ, వాలంటీర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు వద్ద రోడ్డు ప్రమాద ఘటన తనను కలచి వేసిందని, ఇది హృదయ విదారక సంఘటన అని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం తెలిపారు. ఈ ప్రమాదంలో దూపాడు గ్రామంలో ఇద్దరు అన్నదమ్ములు మరణించిన సంఘటనపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన, గాయపడిన దూపాడు, గుంటూరుకు చెందిన కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలను త్వరలోనే తాను కలిసి పరామర్శిస్తానని, వారికి అండగా ఉంటానని చెప్పారు. ఆ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మృతులకు సంతాపం ప్రకటించారు.

పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

ఈ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పంటల బీమా, సున్నా వడ్డీ, పంట నష్ట పరిహారం, పంట గిట్టుబాటు ధర, రైతు భరోసా వంటి పథకాలు అన్ని ఈ పంట నమోదుతోనే ముడిపడి ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని నాయుడు పల్లి గ్రామంలో జరుగుతున్న ఈ పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రతి రైతు తాము సాగు చేస్తున్న పంటలను ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా రైతులకు పథకాలన్నీ అమలవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, నాయుడుపల్లి వీఏఏ పావనేశ్వరి, నాయుడుపల్లి రైతులు పాల్గొన్నారు.

సాంస్కృతిక వారసత్వమే ప్రగతికి మూలం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదే సమాజ ప్రగతికి మూలమని, ఆయా విషయాల పట్ల ప్రజలకు, కొత్త తరాలకు అవగాహన అవసరమని మార్కాపురం శాసనసభ్యులు కెపి నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రసిద్ధ విద్యావేత్త డాక్టర్ అన్నపూడి వీరారెడ్డి విరచిత "మనఊర్ల కథలు" పరిశోధక పుస్తకాన్ని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశేష పరిశోధనతో ఇక్కడి చరిత్రను పుస్తకరూపంలోకి తెచ్చిన సాహితీవేత్త డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డిని, ముద్రణకు సహకరించిన ఆలయ ఛైర్మన్ పెనుగొండ కేశవరావును ప్రశంసించారు. శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రాచార్యులు డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ సంచాలకత్వంలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పెనుగొండ కేశవరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, దేవదాయ శాఖ అధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి, కమల విద్యాసంస్థల కరస్పాండెంట్ పెనుగొండ పవన్ కుమార్, కవులు ఎంవి సుబ్బారావు, రాయప్రోలు వెంకటేశ్వర్లు, చిట్టె రాజేశ్వరరెడ్డి, టిడి వెంకటేశ్వర్లు, కె మల్లారెడ్డి, గోపాలుని హరిహరరావు, పలువురు విద్యారంగ పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. శ్రీసాధన కళాశాల భౌతికశాస్త్ర ఆచార్యులు డాక్టర్ ఎం శేషకుమారి సమగ్రంగా ప్రస్తక సమీక్ష చేశారు. ఆలయ ప్రధాన అర్చక స్వాములు శ్రీపతి అప్పనాచార్యులు కృతికర్తను, పండితులను ఆలయ పక్షాన సత్కరించారు. రచయిత డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం వైభవం, చరిత్రపై మున్ముందు పరిశోధనాత్మకంగా పుస్తకాలు రాసేందుకు కృషి చేస్తానన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల కేంద్రమైన పెద్దదోర్నాలలోని పంచాయతీ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న 40 మంది పారిశుధ్య కార్మికులకు ఆ కార్యాలయ ఆవరణలో తెలుగు బాప్టిస్టు యూనియన్ మార్కాపురం అధ్యక్షులు జీనుకూటి జాన్‌బాబు ఏవిఎం ట్రస్టు మిషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ నిజమైన సేవకులు పంచాయతీ కార్మికులేనన్నారు. వారు ఉదయాన్నే నాలుగు రోజులు పాటు పంచాయతీని శుభ్రంగా ఉంచకపోతే దుర్గంధం వెదజల్లడంతో పాటు వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. అటువంటి పంచాయతీ కార్మికులకు క్రిస్మస్ సందర్భంగా దుస్తులు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో వారికి మరెంతో సహకరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హరిక, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, వైసిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్ యాదవ్, సన్నిధి కిశోర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దిక్కులేని వారిని ఆదరించడమే నిజమైన సేవ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దిక్కులేని వారిని ఆదరించడమే నిజమైన సేవ అని అల్ఫా గ్లోబల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ ఎన్ విజయ భాస్కర్‌రావు అన్నారు. శనివారం ఆయన యర్రగొండపాలెంలోని సన్‌జో సేవాలయంలో ఉన్న మానసిక వికలాంగులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది పుట్టుకతో అంగవైకల్యం కలిగి ఉంటారని తెలిపారు. ఇటువంటి వారిని సమాజంలో కొందరు అవహేళన చేయడం తగదన్నారు. చేతనైతే సహాయం చేయాలన్నారు. క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేసి మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య, పి పాలంకయ్య, కొత్త కిషోర్ కుమార్, బాలకోటయ్య, బాదుల్లా, పాస్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న గూడూరి

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబ సభ్యులను టిడిపి యర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం పరామర్శించారు. మృతదేహాలను మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో సందర్శించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు టిడిపి తరపున అండగా ఉంటామని అన్నారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా త్రిపురాంతకం మండలం దూపాడుకు చెందిన అన్నదమ్ములు ఎనిబెర అభిషేక్, రత్నతేజ, గంటవానిపల్లెకు చెందిన ఉప్పలపాటి దానియేలు మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను టిడిపి ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు పరామర్శించారు. ఆయన వెంట టిడిపి మాజీ మండల అధ్యక్షులు టిడిపి గొట్టం శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం యత్నం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర వ్యాప్తంగా ఒకవైపు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 12 రోజులు నుంచి నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మాత్రం సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ఈక్రమంలోనే సచివాలయ సిబ్బంది చేత కేంద్రాల తాళాలు పగులగొట్టింది. వారిని ఇన్‌ఛార్జిగా నియమిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలు నడపాలని ఆదేశించింది. అంతేకాకుండా శనివారం సచివాలయ సిబ్బంది యర్రగొండపాలెం ప్రాజెక్టు పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో గల లబ్ధిదారులను గుర్తించి సచివాలయ సిబ్బంది చేత ఫోన్లు చేయించి బాలామృతం పంపిణీ చేసేందుకు పూనుకుంది. కాగా సెంటరుకు నలుగురు, ఐదుగురు తప్ప

బాలామృతం పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎవరూ కూడా సచివాలయ సిబ్బంది ఇస్తున్న బాలామృతం తీసుకునేందుకు కేంద్రాలకు వెళ్లడం లేదు. కేంద్రాలకు తమ పిల్లలను పంపిస్తే వారి రక్షణకు బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. పిల్లలను సైతం సెంటర్లకు పంపడం లేదు. అంగన్‌వాడీల సమ్మె తేల్చే వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే దాకా తాము సెంటర్లకు రామని తెగేసి చెబుతున్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-వెలిగండ్ల

గూడూరి దేవమ్మ గ్రేస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం తన స్వగ్రామమైన మొగళ్లూరు గ్రామంలో ఇన్కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ గూడూరి సురేష్‌బాబు క్రిస్మస్ పండుగ, తన కుమార్తె క్రిష్టా గ్రేస్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు, వృద్ధులకు, వితంతువులు దాదాపు 60 మందికి దుప్పట్లు, చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఇన్కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ గూడూరు సురేష్‌బాబు మాట్లాడుతూ తన తల్లి గారైన దేవమ్మ ట్రస్ట్ పేరు ద్వారా ప్రతి ఏడాది పేదలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతానని ఎల్లప్పుడూ పేదలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు అనిల్‌బాబు, పాస్టర్లు గూడూరి స్టాలిన్, గంగవరపు ఫణికుమార్, గూడూరు జాన్, బంగారయ్య, గంగవరపు దేవయ్య, గంగవరపు జ్యోతి, పేదలు, వృద్ధులు, వికలాంగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవస్థానంలో డాక్టర్ ఉగ్ర ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కనిగిరి: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు డాక్టర్ ఉగ్రకు ఆశీర్వచనాలు, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

◆ పెరుగుతున్న మద్దతు ◆ కొనసాగుతున్న సమ్మె

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం నేత డి రమాదేవి

ఇంకొల్లులో పంచాయితీ కార్మికుల సంఘీబావం

ప్రజాశక్తి-కొల్లూరు

అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి రమాదేవి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ న్యాయమైన డిమాండ్లను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని, పిఎఫ్ ఇవ్వాలని, రిటైర్మెంట్ తరువాత పెన్షన్ ఇవ్వాలని అడుగుతుంటే డబ్బులు లేవని చెబుతుందని అన్నారు. లక్ష మంది అంగన్‌వాడీలకు డబ్బులు లేవన్న ప్రభుత్వం వద్ద నాలుగు లక్షల మంది వాలంటీర్లకు పెంచడానికి ఎక్కడి నుండి వచ్చాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణ మోహన్, సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు, నాగరాజు, కుమారి, సౌభాగ్యలక్ష్మి, పద్మ, భాగ్యం పాల్గొన్నారు.

సంతమాగులూరు : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్‌వాడీల సమ్మె, ధర్నా శనివారం 12వ రోజుకు చేరుకుంది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్లపై 12 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె విరమించేది లేదన్నారు. పరిష్కరిం చకుంటే ఉద్యమం ఉధృతం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మస్తాన్ బి, మల్లేశ్వరి, శ్రీదేవి, ఎస్తేరురాణి, నిర్మల, ఆదెమ్మ, రమణ పాల్గొన్నారు.

రేపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఒంటికాలు మీద నిలబడి నిరసన తెలిపారు. శనివారం 12వ రోజు సమ్మెకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ మద్దతు ప్రకటించారు. యూనియన్ సీఐటీయు జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టాలని ఉత్తర్వులు ఇవ్వలేదని చెబుతూనే సచివాలయ సిబ్బందిని పంపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కె వాణి, నాయకులు ఎన్ కృష్ణకుమారి, డి జ్యోతి, నిర్మలజ్యోతి, రజిని, దీప్తి, నాగమణి పాల్గొన్నారు.

చీరాల : ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు పెంపుపై ఇచ్చిన హామీ అమలు చేయకుండా అంగన్‌వాడీలు రోడ్డుపైకి వచ్చేలా చేశారని సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు అన్నారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరసన సమ్మె 12వ రోజుకు చేరుకుంది. సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు మాట్లాడుతు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని కోరితే బెదిరింపులకు దిరుగుతుందని అన్నారు. భయపడే ప్రసక్తి లేదని, ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పి ప్రమీల, జి సుజీవన, సులోచన, బ్యూలా, శిరీష, బుల్లెమ్మాయి, కనకదుర్గ, లత పాల్గొన్నారు.

చిన్నగంజాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గత 12 రోజులుగా జరుగుతున్న అంగన్‌వాడిల నిరసన దీక్షకు టిడిపి, జనసేన నాయకులు శనివారం మద్దతు తెలిపారు. పర్చూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పెద్దపూడి విజయ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు పోద వీరయ్య, జనసేన మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, టిడిపి నాయకురాలు సంధ్యారాణి, బత్తుల శీను, కోకి భాస్కరరెడ్డి, రాయిని ఆత్మరావు, కొక్కిలిగడ్డ రామాంజనేయులు, బాలరాజు, నాంచార్లు, తాటి రాజా, కుక్కల వెంకటేశ్వరరెడ్డి, కె వాసుదేవ, డాక్టర్ కె సుబ్బారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

అద్దంకి : అంగన్‌వాడి కార్యకర్తల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు అధ్యక్షురాలు జి శారద కోరారు. స్థానిక తహాశీల్దారు కార్యాలయం వద్ద 12వ రోజు సమ్మె కొనసాగిస్తున్నారు. సమ్మెకు వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రభుత్వం ముద్దు నిద్ర వీడాలని కోరారు.

చెరుకుపల్లి : అంగన్‌వాడీ కార్యకర్తలు 12వ రోజు సమ్మె కొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. చెవిలో పువ్వులు పెట్టుకుని శనివారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంతోష్ కుమారి, చైతన్య, మల్లీశ్వరి పాల్గొన్నారు.

పర్చూరు : అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె స్థానిక తహాశీల్ధారు కార్యాలయం వద్ద శనివారంకు 12వ రోజుకు చేరింది. కార్యకర్తలు నినాదాలు చేసుకుంటూ బైటాయించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు, ఎం డేవిడ్, బి చినదాసు పాల్గొన్నారు.

వేమూరు : అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం వేమూరులో జరుగుతున్న దీక్షలకు తెలుగు యువత అధ్యక్షులు, మాజీ ఎంపీపీ కనగాల మధుసూధన ప్రసాద్ మద్దతు ప్రకటించారు. అంగన్‌డీలకు గౌరవేతనం తీసివేసి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేసి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి అగస్టీన్, అంగన్‌వాడి యూనియన్ అధ్యక్షులు బసవమ్మ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : అంగన్‌వాడి కార్యకర్తలు చేస్తున్న పోరాటానికి పారిశుధ్య కార్మికులు మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీల నిరసన సమ్మె 12వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలు పట్టుదలతో పోరాటం కొనసాగిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టుకొని అణగదొక్కాలని చూస్తుందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెకు పారిశుద్య కార్మికులు మద్దతు తెలుపుతూ సంఘానికి రూ.10వందల నగదు విరాళం ఇచ్చి మద్దతు తెలిపారు. అంగన్‌వాడి కార్యకర్తలతో గొంతు కలిపి నినాదాలు చేసినారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి నాగండ్ల వెంకటరావు, ప్రాజెక్టు లీడర్లు బి సరళ, దేవమనణి, లత, శ్రీదేవి, రేవతి, దేవమ్మ, కస్తూరి, పారిశుద్ధ్య కార్మికులు పిల్లి వెంకటేశ్వర్లు, కట్టా సత్యానందారం, కృపారావు, బాబురావు, జక్రయ్య, ఆదాము పాల్గొన్నారు.

కారంచేడు : సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి జ్ఞానోదయం కలిగించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం సాయంత్రం కారంచేడులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక చిన్నరథం సెంటర్ నుండి కారంచేడు కాల్వ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. రెండు రోజుల్లో క్రిస్టమస్ పండుగ జరుగుతున్న సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏసుక్రీస్తును వేడుకుంటూ ర్యాలీ చేశారు. ఏసుక్రీస్తు ప్రపంచానికి బోధించిన విధంగా నీ వలనే నీ పొరుగు వారిని ప్రేమించు, ప్రేమ క్షమా గుణాన్ని బోధించిన ఏసుక్రీస్తు బోధనల ప్రకారం సిఎం జగన్‌కు జ్ఞానోదయం కల్పించాలని, అంగన్‌వాడీల జీవన పరిస్థితులను మెరుగుపరిచే విధంగా ఆలోచించాలని, సమ్మెను పరిష్కారం చేయడానికి జగన్ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ కార్యదర్శి జి అనిత, మాధురి, రాజ్యలక్ష్మి, వీరమ్మ, హఫీజ పాల్గొన్నారు.

చీరాలలో మాట్లాడుతున్న సిఐటియు అధ్యక్షులు బాబురావు

వేమూరులో అంగన్‌వాడీల ధర్నా

కామ్రేడ్ మల్లారెడ్డి సోదరుడు మృతి

ప్రజాశక్తి - పంగులూరు

జి బంగారురెడ్డి (78)

సిపిఎం నాయకులు, సిఐటియు కార్యదర్శి, గుడిపాటి మల్లారెడ్డి సోదరుడు గుడిపాటి బంగారురెడ్డి (78) క్యాన్సర్ వ్యాధితో శనివారం మరణించారు. బంగారురెడ్డి గత నాలుగు సంవత్సరాల నుండి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. కొద్ది రోజులుగా మంచానికి పరిమితమైన ఆయన శుక్రవారం చనిపోయాడు. కామ్రేడ్ మల్లారెడ్డి అన్నదమ్ములు ఏడుగురు కాగా బంగారురెడ్డి ఐదవ సంతానం. బంగారురెడ్డికి భార్య అంజమ్మ, కుమారులు వెంకట రమణారెడ్డి, అంజిరెడ్డి ఉన్నారు. వీరిలో వెంకటరమణారెడ్డి అమెరికాలో మెటలర్జికల్ సైంటిస్ట్ గా పని చేస్తున్నారు. రెండో కుమారుడు అంజిరెడ్డి వ్యవసాయంలో ఉన్నాడు. బంగారురెడ్డి భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా నాయకుడు రాయిని వినోద్ బాబు, పాలపర్తి ఏలియా, తలపనేని సుబ్బారావు, సర్పంచ్ గుడిపాటి శ్రీనివాసరెడ్డి నివాళులు అర్పించారు.

రైతులను సన్మానిస్తున్న ఎస్‌బిఐ మేనేజర్ శ్రీనివాసరావు

రైతులకు సన్మానం

ప్రజాశక్తి - పంగులూరు

రైతు దినోత్సవం సందర్భంగా ఇరువురు రైతులను ఎస్‌బిఐ సిబ్బంది ఘనంగా సన్మానించారు. శాలవాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, రైతులకు, స్టేట్ బ్యాంకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తుందని అన్నారు. రైతులు బ్యాంకు ఇచ్చే పంట రుణాలను సద్వినియోగం చేసుకొని పంటలు పండించి, సకాలంలో చెల్లిస్తే బ్యాంకు ఎల్లప్పుడూ రైతుకు సహకరిస్తుందని అన్నారు. రైతులకు అవసరమైన అనేక పథకాలు ఎస్‌విఐలో ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ పంగులూరు బ్రాంచి నుంచి ప్రతి ఏటా పంట రుణాలు తీసుకొని సకాలంలో చెల్లిస్తున్న రైతులు నాగబోయిన వీర రాఘవయ్య, చిలుకూరి వీరరాఘవయ్యను శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు అకౌంటెంట్ వీరాంజనేయులు, క్యాష్ ఆఫీసర్ అనిల్ బాబు, అసోసియేట్లు జోసఫ్ సన్, రత్తయ్య చౌదరి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి గుడిపూడి రామారావు, అంజయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఓటరు అవగాహన కేంద్రం ప్రారంభించిన ఆర్‌డిఒ రవీందర్

ఓటరు అవగాహన కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రెడ్ క్రాస్ జిల్లా కార్యాలయ భవనం క్రింది భాగంలో ఓటరు అవగాహన కేంద్రాన్ని ఆర్డీఒ రవీందర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలి, ఏ అభ్యర్థికి ఓటు వేస్తే నేరుగా అభ్యర్థికే చేరుతుందా, లేదా అనే అనుమానాలను ఈ కేంద్రం ద్వారా నివృత్తి చేసుకునేందుకు ఓటరు అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పట్టణ, గ్రామీణ ఓటర్లు సైతం ఓటు వేసే అంశంపై అవగాహన చేసుకోవచ్చని అన్నారు. అందుకోసం డమ్మీ ఓటింగ్ ఈవీఎంలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ ఓటరు అవగాహన కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహాశీల్దారు చిన్నం సుధారాణి, సీఐ యు శ్రీనివాసులు, డిటి ధనలక్ష్మి, రియల్ ఎస్టేట్ వ్యాపారి గుండ్రెడ్డి శివ పాల్గొన్నారు.

సమాన వేతనం కోరుతూ మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - బాపట్ల

ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్

సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగుల పర్మినెంట్ కోరుతూ మున్సిపల్ కార్మికులు శనివారం ధర్నా చేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని సిఎం మర్చిపోయారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇస్తామని, ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అనేక దఫాలుగా ప్రభుత్వానికి విన్నవించిన స్పందన లేకపోవడంతో ఈనెల 26నుండి మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళ్లక తప్పడం లేదన్నారు. పట్టణాల్లో ప్రజలకు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు ఎనలేని సేవలు అందిస్తున్నారని అన్నారు. నీటిసరఫరా, విద్యుత్, పార్కుల నిర్వహణ, పారిశుద్ధ్యం లాంటి పనుల్లో మున్సిపల్ కార్మికులు ఎంతో బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూనే ఉన్నారని అన్నారు. అయితే వారి శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రతిస్పందించి ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మికుల యూనియన్ నాయకులు అంకమ్మరావు, అశోకు, సూర్య, మురళి, శంకర్, హరిబాబు, ప్రమీల, సిఐటియు నాయకులు తిరుమలరెడ్డి, ఎం కుమార్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు బహూకరణ

ప్రజాశక్తి - వేమూరు

వాలీబాల్ కిట్లు అందజేస్తున్న షాలేంరాజు

ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొంటున్న బాబు జగ్జీవన్ రామ్ యూత్ క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు, జెర్కిన్‌లను గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేంరాజ్ శనివారం అందజేశారు. యువకులు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. క్రీడాకారులను గ్రేస్ ఫౌండేషన్ ప్రోత్సహస్తుందని అన్నారు. అనంతరం సెమీ కిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. బాబు జగజీవనరాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేష్, అనిల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పోరాటం ఉధృతం చేస్తాం

- యుటిఎఫ్ నేత మీగడ
- 12వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే అన్ని సంఘాలను కలుపుకొని పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి హెచ్చరించారు. శనివారం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. 12 రోజులు నుంచి అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు లక్షా ఐదు వేల మంది ఉన్నారని, వారు తలచుకుంటే ప్రభుత్వాన్ని ఏమైనా చేయవచ్చునని చెప్పారు. డిమాండ్లు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ముందుగా పట్టణంలో నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం రఫీ, సిఐటియూ ఏరియా కో ఆర్డినేటర్ షేక్ అమీర్‌బాషా, అంగన్‌వాడీ నాయకురాళ్లు మల్లేశ్వరి, పి సుభాషిణి, ఎ నాగమల్లేశ్వరి, అరుణకుమారి, సుజాత, రోజా, సుబ్బులు, సిహెచ్ సునీత, అరుణ, కే జయమ్మ, ఏ నాగరాజుకుమారి, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రజిని అధ్యక్షతన రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పీసీ కేశవరావు మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అంగన్వాడీల వేతనాల పెంపుదలతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ ధోరణి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. హక్కులను కాలరాసేలా ప్రభుత్వ తీరు ఉందని, ఇది సరికాదని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఒత్తిడులకు బెదిరేది అదిరేది లేదని, తమ సమస్యలు పరిష్కారం కాకపోతే వచ్చే ఎన్నికల్లో అంగన్వాడీల సత్తా ఏమిటో చూపించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్ సుజాత, మనోరంజిత, సీత, రాజ్యలక్ష్మి నారాయణమ్మ అమల అనిత కవిత భాగ్యలక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, ఐద్వా నాయకులు ఎస్‌కే బషీర, ప్రసన్న, సిఐటియు నాయకులు చెన్నకేశవులు, ఎస్కే ఖాదర్‌వలి పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హనుమంతునిపాడు సచివాలయం దగ్గర ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్ల కార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ గత 12 రోజులుగా అంగన్‌వాడీలు ఆందోళన చేస్తుంటే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రికి చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురునాథం, రాములు స్థానిక అంగన్‌వాడీ ఆయాలు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వెలిగండ్ల: అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించాలని వెలిగండ్ల అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ రిలే నిరాహార దీక్షలను సీనియర్ వర్కర్ వెంకటలక్ష్మమ్మ పూలదండలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అనేక ఇబ్బందులకు గురవుతూ సమస్యల పరిష్కారానికి సమ్మె బాట పడితే వారికి బదులుగా ఇతర ఉద్యోగుల చేత చేయించటం, అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఇటువంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలని, అంగన్‌వాడీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రిలే కార్యక్రమంలో సిహెచ్ రఫియా, పెద్దక్క, లలితమ్మ, సౌజన్య, రాధమ్మ, విజయ, ఆదిలక్ష్మి, ప్రసన్న, విజయలక్ష్మి, సీఐటియు జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య, కెవిపిఎస్ నాయకులు రత్నం తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: 12 రోజులుగా గిద్దలూరు అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని సిఐటియు జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడీలు గొంతెమ్మ కోరికలు కోరట్లేదని వైసిపి ఎన్నికల మేనిఫెస్టో పెట్టిన దానిని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం చేసుకునే వ్యవసాయ కూలీల పిల్లలు అన్నం లేక ఆకలితో ఇబ్బంది పడుతున్నారని, దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని అన్నారు. సమ్మెను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు డి స్వర్ణ, ఏ మున్నా, విజయలక్ష్మి, వరలక్ష్మి, రవణమ్మ, సిఐటియు నాయకులు టి ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండపి: చిన్నారులకు పోషక ఆహారం అందించే అంగన్‌వాడీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మండలంలోని కెజి కండ్రిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు జగన్ మామ.. అంగన్‌వాడీ అమ్మల సమస్యలు త్వరగా పరిష్కరించాలని, పేద ప్రజల బిడ్డలకు, బాలింతలకు, పోషకాహారాన్ని అందిస్తున్న అంగన్‌వాడీల సమస్యల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరిని విడనాడాలని ప్ల కార్డులతో నిరసన తెలిపారు.

అంగన్‌వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

గత 12 రోజులుగా సాగుతున్న అంగన్‌వాడీ సమ్మెను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కెజి మస్తాన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్దిపాడు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 12వ రోజుకు చేరగా శనివారం ఈ దీక్షలను పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శేషయ్య ప్రారంభించారు. వీరి సమ్మెకు మద్దతుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి కొండారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మద్దతు ప్రకటించి మాట్లాడారు. సమ్మెలో సిఐటియు జిల్లా నాయకులు బంక సుబ్బారావు, పల్లాపల్లి ఆంజనేయులు, ఉబ్బా ఆదిలక్ష్మి, అంగన్వాడీలు ధనలక్ష్మి, రజిని, ప్రమీల, మస్తానమ్మ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పెద్దదోర్నాలలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవక సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలకు వేతనాన్ని రూ. 26 వేలకు పెంచాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం రఫీ, అంగన్‌వాడీ నాయకురాళ్లు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దర్శి: రాష్ట్రంలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని అంగన్‌వాడీ నాయకులు అచ్చమాంబ, అజిత అన్నారు. దర్శిలో శనివారం అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె నిర్వహించారు. వారికి సీఐటీయు దొనకొండ మండల కార్యదర్శి సూరెపల్లి అంజయ్య మద్దతు పలికారు. వారికి కావాల్సిన కనీస వేతనాలు, బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సందు వెంకటేశ్వరరావు, తాండవ రంగారావు, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

యర్రగొండపాలెంలో మాట్లాడుతున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

గిద్దలూరులో మాట్లాడుతున్న సిఐటియూ నేత జి శ్రీనివాసులు

కొండపిలో చిన్నారుల నిరసన

వెలిగండ్లలో దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

దర్శిలో అంగన్‌వాడీల నినాదాలు

రానున్నది ప్రజా ప్రభుత్వం: కందుల

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

యువగళం ముగింపు సభను భారీ ఎత్తున విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నామని మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక జవహర్ నగర్‌లోని స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ విజయనగరం జిల్లాలోని పోలేపల్లిలో జరిగిన నారా లోకేష్ యువగళం ముగింపు సభకు మునుపెన్నడూ లేనివిధంగా లక్షలాదిగా హాజరై నవశకానికి నాంది పలికారని అన్నారు. సభకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ విచ్చేసి భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్తవరవడికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన ఆధ్వర్యంలో భవిష్యత్తులో ప్రజా ప్రభుత్వం రాబోతోందని, దీనికి నాంది యువగళం ముగింపు సభకు ప్రజలు లక్షలాదిగా హాజరై తమ మద్దతు తెలియజేశారన్నారు. ఈ దుర్మార్గపు వైసిపి పాలనలో ల్యాండ్, శాండ్, వైన్ మాఫియాలే రాజ్యమేలుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవడానికి ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారని తెలియజేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందుల

నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

ప్రజాశక్తి-కంభం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో కళ్లకు గంతలకట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు బి పాండు, ఎస్ఏ కలాం పాల్గొని ఉద్యోగులకు మద్దతుగా మాట్లాడారు. సమస్యల పరిష్కారానికై వారం రోజులుగా ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని, ఉద్యోగుల న్యాయమైన కోరికలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు వారి సంపూర్ణ మద్దతును తెలిపారు. తక్షణమే హెచ్ఆర్ పాలసీ అమలుచేసి, తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఐకిడ్స్ చిన్నారులు

'ఐ కిడ్స్'లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని ఐ కిడ్స్ పాఠశాలలో ప్రిన్సిపల్ షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్‌ను జరుపుకుంటారని అన్నారు. తోటి వారి పట్ల దయ, ప్రేమ, కరుణ వుండాలని కోరారు. సత్ప్రవర్తనను కలిగి ఉండటంతో మానవ సంబంధాలు బలపడతాయని అన్నారు. పాఠశాల డైరెక్టర్ రజియ మాట్లాడుతూ యేసు బోధనలు అనుసరణీయమని అన్నారు. జీవిత విలువలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చిన్నారులు శాంతక్లాజ్ వేషాలతో, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెరిలిన్, సంధ్య, ఉషా, కనకదుర్గ, సౌమ్య పాల్గొన్నారు.

బ్రోచర్లు పంచుతున్న వ్యవసాయాధికారులు

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-దర్శి

రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంబించాలని మండల వ్యవసాయాధికారి వి బాలకృష్ణ నాయక్ అన్నారు. మండలంలోని బొట్లపాలెం, చెరువుకొమ్ముపాలెం గ్రామాల్లో ఆయన అధ్యక్షతన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విత్తనశుద్ధి, జీవన ఎరువు వాడకం వంటి ప్రాముఖ్యమైన విషయాలను రైతులకు ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం అధికారులు శైలజారాణి, శేషమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకయ్య, యలమంద, వ్యవసాయ సహాయకులు బాజి, రైతులు పాల్గొన్నారు.

రైతు కూలి నేత మోహనరావు మృతి

ప్రజాశక్తి - పంగులూరు

బత్తుల మోహనరావు (82)

రైతు, కూలీ సంఘం నాయకులు, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర కమిటీ సభ్యులు, బైట మంజులూరు వాసి బత్తుల మోహనరావు (82) అనారోగ్యం కారణంగా శనివారం మరణించాడు. గత మూడు రోజులుగా ఆరోగ్యం బాగాలేక నిరసించిపోవడంతో ఆయనను శనివారం మేదరమెట్ల హాస్పిటల్‌కు తీసుకెళు తుండగా మార్గమధ్యంలోనే ఆయన మరణించాడు. మోహనరావు ఎస్ఎస్ఎల్సి చదువుకొని చిన్న వయసులోనే విప్లవ ఉద్యమంలో అడుగుపెట్టాడు. హేతు వాద సంఘంలో నాలుగేళ్ల పనిచేశారు. ఒంగోలులో జరిగిన రైతు కూలి సంఘంలో వరవరరావు చొరవతో విప్లవ పార్టీలో చేరాడు. ఎన్ఆర్, ఎస్ఆర్, సరికొండ అంజంరాజు, అంజిరెడ్డిలతో పరిచయమై పీపుల్స్ వార్ లో చేరారు. బైటమంజులూరులో పది రోజులు పాటు తరగతులు నిర్వహించారు. 1991లో రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. తరువాత దేశభక్తి ప్రజా తంత్ర ఉద్యమ రాష్ట్ర కమిటీ సభ్యునిగా, జిల్లా అధ్యక్షుడిగా పని చేశాడు. 1991లో సారా వ్యతిరేక ఉద్యమం సందర్భంగా బైట మంజు లూరు గ్రామంలో సారా ప్యాకెట్లు తీసుకెళ్లే ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేశారు. ఈ కేసులో జనకవరం దగ్గర ఆర్టీసీ బస్సును దగ్ధం చేసిన కేసులో పశ్చిమ ప్రాంతాన వెలుగొండ దగ్గర జరిగిన ఎదురు కాల్పుల్లో పోలీసులకు లొంగిపోవడంతో ఈ మూడుకేసులో మొత్తం 10ఏళ్ల పాటు జైలు జీవితం అనుభవించారు. తాను విప్లవ ఆలోచన వైపు మళ్లటానికి, ఉద్యమంలో పాల్గొనడానికి, తన అన్న భత్తుల సుబ్బారావు ప్రభావమేనని మోహనరావు చెప్పేవారు. మోహనరావుకు భార్య అనంతలక్ష్మి, కుమారులు రేణుక రవీంద్రబాబు, వెంకటరావు, శ్రీనివాసరావు ఉన్నారు. మోహనరావు కళ్లను శంకర్ కంటి ఆసుపత్రి వారికి కుటుంబ సభ్యులు దానం చేశారు. బత్తుల మోహనరావు భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా నాయకుడు రాయిని వినోద్ బాబు, సిపిఎం నాయకులు రామచంద్రరాజు, పూసపాటి సుబ్బరాజు, లక్ష్మణ్ రాజు, రేపల్లె శివ, కసుకుర్తి నాగయ్య, మాజీ సర్పంచ్ వెంకటప్పలరాజు, నీలాంబరం నివాళులు అర్పించారు.

ఒంగోలు కలెక్టరేట్ : దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ సీనియర్ నేత, మావోయిస్టు పార్టీ అభిమాని బత్తుల మోహనరావు శనివారం తన స్వగ్రామం పంగులూరు మండలం బైటమాంజులూరులో ఆకస్మికంగా మరణించారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో ఆదివారం జరుగుతాయని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు తెలిపారు. ప్రభుత్వ భూములతో పాటు దేవాదాయ భూములపై కూడా పోరాటం చేసారన్నారు. భూ స్వామ్య నేపథ్యం కలిగిన నాయనకు దళిత సమస్యలంటే అలవి మాలిన అభిమానమన్నారు. మార్టూరులో మరోసారి ఆయనను పోలీసులు నక్సలైట్‌గా అనుమానించి ఆరు నెలలు జైల్లో పెట్టారన్నారు. నక్సలైట్ అనుబంధ సంఘాల సమావేశాలు ఎక్కడ జరిగిన సభలు నిర్వహణలో ఆయన ముందు ఉండేవారన్నారు.

సబ్ జైలును సందర్శించిన సివిల్ జడ్జి

ప్రజాశక్తి - గిద్దలూరు

ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి మేరీ

పట్టణంలోని సబ్‌జైలును అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి మేరీ సారా ధానమ్మ శనివారం పర్య వేక్షించారు. ఈ సందర్భంగా అక్కడి వంటలను, వంటశాలను పరిశీలించారు. ఖైదీల బాగోగులను, వారి నేరాల పూర్వ పరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ఖైదీలతో మాట్లాడారు. విచక్షణతో నడుచుకొని తిరిగి నేరాలకు పాల్పడకుండా సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. నేరప్రవత్తి మానుకోవాలని అన్నారు. న్యాయ సహాయం అవసరమైన వారికి న్యాయ సహాయంతో పాటు న్యాయ వ్యాధిని ఉచితంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ య లింగారెడ్డి, ప్యానల్ న్యాయవాది ఎం పిచ్చయ్య యాదవ్, న్యాయవాది బి రాజ్‌కుమార్ నాయక్, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధనరావు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ రొటేరియన్ పువ్వాడ రామ కోటేశ్వరరావు సౌజన్యంతో శనివారం రాజీవ్ నగర్ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, ప్లేట్స్,పెన్స్, స్కేల్స్ పంపిణీ చేశారు. హెచ్ఎం కరి రమయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మలాది శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి చక్కగా చదువుకోవాలని అన్నారు. తల్లి తండ్రులు చెప్పిన పనులు చేస్తూ గురువులుకి, తల్లితండ్రులకి మంచి పేరు తేవాలని కోరారు. రోటరీ సెక్రటరీ వీరయ్య మాట్లాడుతూ జీవితంలో చదువునే ఆయుధంతో పేదరికాన్ని జయించాలని పేర్కొన్నారు. నర్రా శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు బాగా పాటలు పాడారని, చదువులో బాగా రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. ట్రెజరర్ భువనేశ్వరి, పూర్వ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, సీనియర్ రొటేరియన్ పసుపులేటి ఆంజనేయులు, పువ్వాడ రామకోటేశ్వరావు పాల్గొన్నారు.

గర్భిణీ మృతదేహానికి రీ పోస్టుమార్టం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన గర్భిణీ మహిళ మర్సీరాణి మృతదేహానికి శనివారం రీ పోస్టుమార్టం నిర్వహించారు. చెరువు కొమ్ము పాలెం గ్రామానికి చెందిన మెర్సీ రాణి అనే మహిళను సెప్టెంబర్ నెల్లో ప్రసవం కోసం సామాజిక ఆరోగ్య కేంద్రానికి బంధువులు తీసుకువెళ్లారు. మహిళ ప్రసవం సమయంలో మృతి చెందింది. అయితే మహిళ మృతి చెందటానికి ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరెంటెంట్ డాక్టర్ వాహెలా చౌదరిపై కేసు నమోదయింది. మృతదేహానికి మరలా పోస్టుమార్టం చేయాలని బంధువులు ఫిర్యాదుపై కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దీంతో మృతదేహాన్ని వెలికి తీసి అధికారుల సమక్షంలో శనివారం పోస్ట్ మార్టం చేశారు

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - బేస్తవారిపేట

క్రిస్మస్, నూతన సంవత్సర సందర్భంగా క్రిస్టియన్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో స్థానిక ఏబీఎం కాంపౌండ్ నందు నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎస్ఐ బత్తుల నరసింహారావు శనివారం ప్రారంభించారు. ఎస్ఐ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దఢత్వాన్ని కల్పిస్తూ కలిగిస్తాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దాతపూడి ఐజయ్య, ఎమ్మార్పీఎస్ గిద్దలూరు నియోజకవర్గ కన్వీనర్ బోదాల ఆనంద్, తెలుగు బాప్టిస్ట్ చర్చి కార్యవర్గ సభ్యులు చల్లగాలి జోసెఫ్, సామేలు, చల్లగాలి విక్టర్, బోప్పురి శ్యాంబాబు, యు జోసెఫ్, గుర్రం ఆనంద్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వేపపోగు భరణి, ఎం ప్రవీణ్ కుమార్, చల్లగాలి విజయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పంగులూరు వాసికి భూమిపుత్ర పురస్కారం

ప్రజాశక్తి - పంగులూరు

భూమి పుత్ర పురస్కారంతో రైతుకు సన్మానం

రైతులకు విలువైన సూచనలు, సలహాలు అందించి, వ్యవసాయ అభివృద్ధికి కృషి చేసిన పంగులూరు మండల వాసి, పృథ్వి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ గరికపాటి సుబ్బారావుకు భూమిపుత్ర పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్రం మహబూబాద్‌లో శనివారం రైతు సహాయ వేదిక ఈ పురస్కారాన్ని అందజేసింది. మండలంలోని అలవలపాడుకు చెందిన గరికపాటి సుబ్బారావు, మరి కొంతమంది రైతులు కలిసి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎఫ్‌పిఒ అనే ఒక గ్రూపును ఏర్పాటు చేసి, దానికి పృథ్వి అని పేరు పెట్టుకున్నారు. రైతులందరూ కలిసి అక్కడ ఒక ఎరువుల షాపును ఏర్పాటు చేశారు. ప్రజలకు పంపిణీ చేస్తున్న సబ్సిడీ శనగలను ఈ గ్రూపు ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయటానికి మూడు కలెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేశారు. త్వరలో ఈ గ్రూపు ద్వారా రైతులకు కావలసిన కోల్డ్ స్టోరేజిని, కేంద్ర ప్రభుత్వం అధిక సబ్సిడీతో ఏర్పాటు చేయడానికి, రైతుల ద్వారా విత్తనం పండించి ఆ విత్తనాన్ని మరలా రైతులే పొలంలో విత్తుకోవడానికి అనుకూలంగా వ్యవసాయం చేసే విధంగా పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అనేక పంటలను ఈ కలెక్షన్ పాయింట్లు ద్వారా ఎక్స్‌పోర్ట్ చేయడానికి ఒక పద్ధతి ప్రకారం వెళు తున్నారు. ఈ విధంగా రైతులకు సహకరిస్తున్న గరికపాటి సుబ్బారావుని శనివారం రెండు తెలుగు రాష్ట్రాల రైతుల సమక్షంలో భూమిపుత్ర అవార్డుతో సన్మానించారు.

రోటరీ ఆధ్వర్యంలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని భగవాన్ రాజుపాలెం గ్రామానికి చెందిన బత్తుల మోహనరావు (87) శనివారం మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చారు. రోటరీ ప్రతినిధి సోమేపల్లి రామ మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు సమాచారంతో శంకర కంటి వైద్యులను గ్రామానికి వచ్చి కార్నియా సేకరించారు. నేత్రదానం చేసినందుకు దాత భార్య అనంతలక్ష్మి, కుమారులు రేణుక, రవీంద్రనాథ్‌బాబు, వెంకట్రావు, శ్రీనివాసరావు, కోడళ్ళు ప్రభావతి, వెంకటరత్నం, సునీత, రేపల్లె సాంబశివరావులను రోటరీ అధ్యక్షులు కరి కమలేశ్వరావు, చుండి సాంబశివరావు అభినందించినారు.

సెన్సార్ బోర్డ్ సభ్యులుగా హరిప్రియ

ప్రజాశక్తి -రేపల్లె

అల్లంశెట్టి హరిప్రియ

అడ్వైజరీ ప్యానెల్ మెంబర్ ఆఫ్ సెంట్రల్ బోర్డ్ ఫిలిం సర్టిఫికేషన్ సభ్యులుగా మండలంలోని ఉప్పూడి గ్రామానికి చెందిన అల్లంశెట్టి హరిప్రియ నియమితు లయ్యారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు అల్లంశెట్టి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిప్రియ రెండేళ్ల పాటు ఆ విధులు నిర్వహిస్తారని తెలిపారు. హైదరాబాద్‌లో సీనియర్ న్యూస్ ప్రెజెంటర్‌గా దశాబ్ద కాలంగా ఆమె పని చేస్తున్నారని చెప్పారు. హరిప్రియకు ఎంపీ మోపిదేవి వెంకటరమణరావు, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరు గణేష్, ఎంపీటీసీ అల్లంశెట్టి సతీష్ బాబు, జనసేన అధ్యక్షులు రాతంశెట్టి మహేష్ శుభాకాంక్షలు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర'ను ప్రారంభించిన హనిమిరెడ్డి

ప్రజాశక్తి - అద్దంకి

ఆడుదాం ఆంధ్ర ఆటలను ప్రారంభించిన హనిమిరెడ్డి

పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర ఆటలను వైసిపి ఇన్‌ఛార్జి పి హనిమిరెడ్డి శనివారం త్రీ కే రన్ జండా ఊపి ప్రారంభించారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయం నుండి ప్రధాన రహదారులలో 3కె రన్ కొనసాగింది. నాయకులుతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైసీపీ ఇన్చార్జి హనిమిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఇమిడి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్టిలో మాణిక్యాలను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలన్నదే జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులుతో పాటుగా చైర్ పర్సన్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేసు పద్మేష్, కె అనంతలక్ష్మి, వైసిపి కౌన్సిలర్లతోపాటు కె వీరయ్య పాల్గొన్నారు. ముక్కోటి పర్వదిన సందర్భంగా వైసిపి ఇన్చార్జి పాణెం హనిమిరెడ్డి కాకానిపాలెం శ్రీ రంగానాయక స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పర్వదిన సందర్భంగా ప్రజలకు అన్ని విధాల మేలు జరగాలని ఆకాంక్షించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కోట శ్రీనివాస్ కుమార్, చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ కె అనంతలక్ష్మి, కౌన్సిలర్ మేడం రమణ, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

టంగుటూరు : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే ఆడుదాం ఆంధ్ర లక్ష్యమని కొండపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ తుల్లిబిల్లి అశోక్ బాబు పేర్కొన్నారు. శనివారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేసేందుకు విధి విధానాలను వాలంటీర్లకు వివరించారు. అనంతరం గ్రామస్తులలో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. జమ్ములపాలెం పంచాయతీ కార్యదర్శి యు అరుణకుమారి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పూసా హైడ్రోజెన్'తో అధిక పోషకాలు

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల రైతు భరోసా కేంద్రం పరిధిలోని వేరుశనగ సాగులో పూసా హైడ్రోజెన్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా వనరుల కేంద్రం ఆత్మ ఫార్మర్ ఓరియంటెడ్ పథకం కింద ఈ పూస హైడ్రోజెన్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. మొక్కకు అవసరమైన తేమను అందించడంలో బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. రైతు పొలంలో వేసి దాని ఫలితాలను చూడటం కొరకు రైతులకు అవగాహన కల్పించేందుకు ఎకరా పొలంలో వేశారు. కార్యక్రమంలో ఎఓ మోహన్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పొదిలి

ఈ కామర్స్, డిజిటల్ పేమెంట్లపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వినియోగ దారుల సంఘాల సమాఖ్య చైర్మన్ ఎం నాగేశ్వరావు అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. తాసిల్దార్ సిహెచ్ అశోక్ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా రక్షణ సమితి సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. న్యాయవాది ధర్నాసి రామారావు, జనరల్ సెక్రెటరీ జిబి షా, వైస్ ప్రెసిడెంట్ ఎన్ అపర్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ఉప కలెక్టర్‌గా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన రాహుల్ మీనాను కాంగ్రెస్ నాయకులు ఆయన కార్యాలయం నందు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి సయ్యద్ జావిద్ అన్వర్ మాట్లాడుతూ అన్ని రంగాలలో పూర్తిగా వెనుక బడిన పశ్చిమ ప్రకాశంలో ప్రజల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని కోరారు. ఎన్నో సంవత్సరాలు అపరిష్కతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలనిఉప కలెక్టర్ రాహుల్ మీనాను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాలి వెంకట రామిరెడ్డి, షేక్ ఇస్మాయిల్, బొగ్గు రామిరెడ్డి, కష్టారెడ్డి, మస్తాన్ వలీ, ఆంజనేయులు, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని గంగవరం బాలల విద్యా, వైజ్ఞానిక వేదిక ఆధ్వర్యంలో ఎంవిఆర్ఆర్ కళ్యాణ మండపంలో పదో తరగతి విద్యార్థులకు శిక్షణా శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు మెళకువలు, అందుకు యుటిఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లు-2024ను ఎలా వినియోగించుకోవాలనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు హాజరయ్యే విద్యార్థులు శిక్షణలో మెళకువలు పొంది మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

రైతు సంఘం ద్వితీయ మహాసభ

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

స్థానిక సాయిబాబా దేవస్థానంలో రైతు సంఘ సంతనూతలపాడు నియోజకవర్గ ద్వితీయ మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సభకు ఘట్టమనేని బసవయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి హనుమారెడ్డి మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ప్రకృతి వైపరీత్యాలు, కల్తీవిత్తనాలు, పురుగు మందులు, ఎరువులుతో పాటు గిట్టుబాటు ధరలు లేక నష్టాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. వారిని ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీలను అమలు చేయటంలో విఫలమైందని ఆరోపించారు. వ్యవసాయంలో తెచ్చిన నల్లచట్టాలను పోరాట పటిమతో తిప్పికొట్టారని అన్నారు. సాగునీరు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వెలిగొండ ప్రాజెక్టు నేటికి పూర్తి కాలేదని అన్నారు. అదేవిధంగా రూ.647కోట్లతో గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మించి 14సంవత్సరాలైన నేటికి చివరి భూములకు నీరు ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం దెబ్బతిన్న గేట్లు కూడ మరమ్మతులు చేపట్టలేని దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు కె వీరారెడ్డి, పోకూరి వెంకటేశ్వర్లు, జి శేషయ్య, చెరకూరి వాసు, కె వెంకట్రావు, పులుగు చెన్నారెడ్డి, పి అఖిల్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండలంలోని తిమ్మసముద్రం, నిడమానూరు గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పదకాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం 11పదకాలు గురించి వివరించారు. స్థానిక వెంకట్రాద్రి గ్యాస్ ఏజన్సీ నిర్వహకుడు సురేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పదకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపిడిఓ జయమణి, సర్పంచ్‌లు కంచర్ల సాల్మన్‌రాజు, వడ్డిముక్కల శ్రీనివాసరావు, కార్యదర్శులు చంద్రశేఖరరావు, సుబ్రమణ్యం, వైసిపి సీనియర్ నాయకులు పులివర్తి పరందామిరెడ్డి, ఎపిఒ రవిబాబు, ఫార్మాసిస్ట్ రత్నకుమార్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండపి : కేంద్ర ప్రభుత్వాల ద్వారా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ రమణమూర్తి కోరారు. అనకర్లపూడి, ముప్పరాజుపాలెం గ్రామాల్లో సంకల్ప యాత్ర నిర్వహించారు.

జంపని వివాహ వేడుకల్లో ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని జంపని గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కర్లపూడి హృదయరాజ్(లేట్) కుమారుని వివాహ వేడుకల్లో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు శనివారం పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వాదించారు. హృదయరాజు టిడిపి బలోపేతానికి ఎంతో కృషి చేసారని కొనియాడారు. ఆయన వెంట గ్రామ టిడిపి నాయకులు, యువకులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి - కొండపి : ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించ వచ్చని మండల సమ్మెక్య అధికారులు రైతులకు సూచించారు. మండలంలోని పెరిదేపిలో పకృతి వ్యవసాయం ద్వారా వేసిన పంటలను సమైక్య అధికారులు శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ వై రంజిత్, సుధారాణి, గౌతమి, విఒఎ, ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సూక్ష్మ సృజనాత్మకత అవసరం

ప్రజాశక్తి - బాపట్ల

బహుమతులు అందజేస్తున్న డిఇఒ రామారావు

విద్యార్థులు సూక్ష్మ మైన సృజనాత్మకతను అలవర్చుకోవాలని విద్యా శాఖ అధికారి పివిజె రామారావు అన్నారు. పురపాలక ఉన్నత పాఠశాల్లో జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో విజేతలకు బహుమతి శనివారం అందజేశారు. విద్యార్థులు శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. విద్యార్థులు సైన్సు పట్ల ఆసక్తి కనబర్చాలని అన్నారు. గణితమేళా, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులు ఉత్సాహంగా నైపుణ్యాన్ని కనబడటం గర్వకారణమని అన్నారు. విజేతల వివరాలను జిల్లా సైన్స్ అధికారి సాదిక్ మాస్టారు ప్రకటించారు. జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన 75ప్రదర్శనల్లో వ్యక్తిగత విభాగంలో ఈపురుపాలెం జెడ్పి ఉన్నత పాఠశాల రైన్ వాటర్ హార్వెస్టింగ్, తిమ్మాయిపాలెం జెడ్పి ఉన్నత పాఠశాల సెక్యూరిటీ సిస్టం, బోదవాడ జెడ్పి ఉన్నత పాఠశాల అండర్ పాస్టన్నల్, సమూహ విభాగంలో గుళ్లపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల ఫీచర్ నీడ్స్ టు ప్యూచర్, కొల్లూరు జెడ్పి ఉన్నత పాఠశాల సాయిల్ మాయిశ్చర్ సెన్సార్, మేదరమెట్ల జెడ్పి ఉన్నత పాఠశాల మిడ్ డే మీల్ ప్రోగ్రాం, ఉపాధ్యాయ కేటగిరిలో కె పోతురాజు జెడ్పి ఉన్నత పాఠశాల ఈజీ లెర్నింగ్ మ్యాథమెటిక్స్ మోడల్, పెద అంబడిపూడి జెడ్పి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు డి స్వర్ణలత మ్యాథమెటిక్స్ ఇన్ నాడు నేడు, పాఠశాల విభాగంలో ఇంకొల్లు ఎన్ఆర్ అండ్ వివిఎస్ఆర్ హై స్కూల్ కళలతో విజ్ఞానం విజేతలుగా నిలిచాయని తెలిపారు. ఈనెల 28, 29తేదీల్లో కడపలో జరిగే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలు పాల్గొంటారని తెలిపారు. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటి డిఇఒలు ఆర్ శ్రీనివాసులు, జి వెంకటేశ్వర్లు, ఎంఈఒ2 డి ప్రసాదరావు, హెచ్ఎం రాజశ్రీ, సైన్స్ కో ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి , ఎ శ్రీనివాసరావు, సికిందర్, మీర్జాన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

మండలంలోని పొన్నపల్లిలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ పైనం ఏడుకొండల రెడ్డి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్, ట్రీ, క్రిస్మస్ తాతయ్య వేషధారణలు చూపరులను అలరించాయి. స్కూలును ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్, ప్రిన్సిపాల్ సందర్శించి అభినందించారు. సీఈఒ పైనం గణేష్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాదరెడ్డి, ప్రిన్సిపాల్ నర్గిస్ ఖ్యాజి పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : స్థానిక ఆదర్శ హై స్కూలులో సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ తాత వేషధారణలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అభినందించారు. వంకాయలపాడు సాయిరామ గురుకుల విద్యాలయంలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

శింగరాయకొండ : మదర్ లాండ్ సొసైటీ ప్రివెన్షన్ యూనిట్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ జి శుభకిరణ్ మాట్లాడు తూ క్రీస్తు జన్మదిన పరమార్థాన్ని వివరించారు. శ్రీధర్, ఆషా సంధ్య, నాగమణి, వెంకట్రావు, హైమావతి, రామ కోటయ్య, సుభాషిణి, సునీత, మేరీ, పీర్, ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.

చీమకుర్తి : అభయ కళారాధన అధ్యక్షులు మద్దాళి మాధవరావు సెమిక్రిసమస్ సంధర్భంగా పేద ఫాస్టర్లకు, వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం స్థానిక ప్రేయర్ పవర్ చర్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్స్ ఇసాక్, కోటేశ్వరరావు, ఫిలిఫ్, పేతురు, తన్నీరు ఇసాక్ పాల్గొన్నారు.

రేపల్లె : ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు షారోన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు దాసరి భరణి అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ పుట్ట అబ్రహం ప్రార్ధన చేశారు. మున్సిపల్ చైర్మన్ కట్ట మంగా, వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, కమిషనర్ బి విజయసారిధితో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 40మంది పేద పిల్లలకు బట్టలు పంపిణీ చేశారు. కౌన్సిలర్ సంఘం అజయ్, వైసిపి నాయకులు హనోక్, నాగరాజు, వెంకటేశ్వరరావు, ప్రకాష్ పాల్గొన్నారు.

వేటపాలెం : క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎంఈఒ ఎవి సుబ్బయ్య అన్నారు. మండలంలోని శ్రీ సాయి స్కూల్లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎస్ఐ జి సురేష్ మాట్లాడుతూ క్రమశిక్షణ, విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. కరస్పాండెంట్ సయ్యద్ అక్బర్ పాల్గొన్నారు.

పార్టీలు మారడం సహజం : బొర్రా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -రేపల్లె

అధిష్టానం ఎంపిక చేసిన నూతన ఇన్‌ఛార్జితో పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని వైసిపి నాయకులు, న్యాయవాది బొర్రా శ్రీనివాసరావు ఆరోపించారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. రేపల్లె సీటు విషయంలో అధిష్టానం తీసుకుంటున్న నిర్ణయాలపట్ల పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. పార్టీని నష్టపెట్టే మందే విధంగా ఎవ్వరు వ్యవహరించిన నమ్మక ద్రోహం చేసినట్లేనని చెప్పారు. వైసిపిని రాష్ట్రం నుండి పారదోలుతామని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీలు మారటం సర్వసాధారణం అన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపిని ప్రజలు తరిమికొడతారని చెప్పారు. సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు అందజేసిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఎవ్వరూ అమలు చేయలేదని అన్నారు. వైసిపి శ్రేణులు సమిష్టిగా గెలుపుకు పనిచేయాలని కోరారు. నూతన ఇన్‌ఛార్జి విషయంలో పున పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

నల్లూరి గోపికి నివాళి

ప్రజాశక్తి - చీమకుర్తి

మండలంలోని నిప్పట్లపాడుకు చెందిన నల్లూరి గోపి(27) భౌతిక కాయానికి సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ కుమార్ నివాళులు అర్పించారు. నల్లూరి గోపి శుక్రవారం సాయి నాథ కాటా వద్ద ఒంగోలు - కర్నూలు రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. టిడిపి అధ్యక్షులు జి రాఘవరావు, గాలి సుబ్బయ్య, నల్లూరి వెంకటేశ్వర్లు, నల్లూరి శ్రీనివా రావు, యూటిఎఫ్ కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు నివాళులు అర్పించారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

గీతాజయంతి వేడుకలు ఘంటసాల స్మారక సమితి వ్యవస్థాపకులు ఒరుగంటి సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కంచుకంఠ బిరుదాంకితులు చిలుకూరి శ్రీను మాస్టారు భగవద్గీత గురించి వివరించారు. కార్యక్రమంలో ఒరుగంటి దుర్గ, ఒరుగంటి వెంకన్నశాస్త్రి, నరసింహస్వామి, ఎం రామమూర్తి, రాంబాబు, గద్దె కోటేశ్వరరావు, చంద్రమౌళి, రాముడు, సుబ్బులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ పాలేటి ఆదిత్యవిక్రమ్

పాలేటి ఆధ్వర్యంలో చీరలు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

క్రిస్మస్ పండుగ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం ఆనందంగ ఉందని ప్రజా వేదిక, ఐక్య క్రిస్టియన్ జెఎసి వ్యవస్థాపకులు గుమ్మడి ఏసురత్నం అన్నారు. పట్టణంలోని మరియంపేటలో రోమన్ క్యాథలిక్ మిషన్ ఆర్సిఎం చర్చిలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. పాస్టర్ జంగిలి ఏసురత్నం ప్రార్ధన చేసి దేవుని వాక్యం బోధించారు. కార్యక్రమంలో రేవరెడ్ గుమ్మడి రత్న ప్రకాష్, మన్నం ప్రతాప్ పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్

బాధితులకు రెడ్ క్రాస్ సాయం

ప్రజాశక్తి - నగరం

మండలంలోని మీసాలవారిపాలెం కరకట్ట యానాది సంఘంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు ఇళ్ళు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో యానాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలారు. బాధిత కుటుంబాలకు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వంట సామాగ్రి, టార్పాలిన్ పట్టలు, హైజిన్ కిట్లను రెడ్‌క్రాస్ చైర్మన్, పిల్లల వైద్యులు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అందజేశారు. డాక్టర్ వసంతం వీరరాఘవయ్య ఆదేశాల మేరకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు అడుసుమల్లి ప్రభాకర్, సయ్యద్ కరిముల్లా, బేతపూడి నాగేంద్రరావు, సిపార్డు స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ కొమరగిరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పర్చూరు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరింత అప్రమత్తంగా ఉండాలని బాపట్ల డిఎస్పి టి వెంకటేశులు పోలీసు సిబ్బందిని శనివారం ఆదేశించారు. గ్రామాల్లో పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ గ్రామాలను సందర్శిస్తు ఉండాలని అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వార్షిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నెలకొన్న శాంతి భద్రతల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసుల వారీగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఎస్‌బిడబ్ల్యు అందజేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించాలని సిఐ పి అక్కేశ్వరరావు, ఎస్సై వి రవిశంకర్‌రెడ్డిలను ఆదేశించారు.

సైన్స్ ప్రదర్శనలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కురిచేడు

మార్కాపురంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో స్థానిక వైఆర్ జెడ్పి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి సిహెచ్ దేవరాజ్ వ్యక్తిగత విభాగంలో టెస్లా కాయిల్ అనే ప్రాజెక్టును ప్రదర్శించి ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు హెచ్ఎం జివిఎస్ఆర్ సాయి తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో శృజనాత్మకతను పెంచుతాయని అన్నారు. ద్యార్థి దేవరాజును గైడ్ టీచర్ ఎం ఉదయభాస్కర్‌ను విద్యా కమిటీ చైర్మన్ వి సుభాషిణి అభినందించారు.

ఓటమి భయంతో జగన్..

- తెలుగుదేశం ఓట్ల తొలగింపుపై ఈసీకి ఫిర్యాదు - టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

యువగళం పాదయాత్ర ముగింపు సభ అత్యంత విజయవంతం కావడం దేశ చరిత్రలోనే నిలిచిపోతుందని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలియజేశారు. సిఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది. తన క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉగ్ర మాట్లాడారు. యువగళం పాదయాత్ర ముగింపు సభకు ఐదు లక్షల మంది హాజరు కావడం జరిగిందని, సభ జరిగే నియోజకవర్గం నుంచి 20వేల మంది వస్తారని అంచనా వేయగా సుమారు 50 వేల మంది వచ్చారంటే ఈ దుర్మార్గపు వైసీపీ పాలనను సాగనంపేందుకు ప్రజలు ఎంతగా ఎదురు చూస్తున్నారో అర్థమవుతుందన్నారు. సభకు వచ్చేందుకు కేంద్రం రైళ్లను ఇవ్వగా ఒరిస్సా ప్రభుత్వం 100 బస్సులను ఇవ్వగా ఏపీ ఒక్క బస్సును కూడా ఇవ్వలేదని చెప్పారు. వైసీపీ కార్యక్రమాలు అన్నింటికీ ఏపీ బస్సులను విని యోగించుకుంటారు గానీ ప్రతిపక్ష పార్టీ కార్యక్రమం కాబట్టి బస్సులను ఇవ్వకపోయినా సభ విజయవంతమయ్యేలా జనం తరలివచ్చారన్నారు. యువ గళం ముగింపు సభ వైసిపి ఓటమిని డిక్లేర్ చేసిందని, దీంతో ఓటమి భయం పట్టుకున్న సిఎం జగన్ సర్దుకునే పనిలో ఉన్నాడన్నారు. సభ జరిగే నియోజకవర్గం ఇన్నార్జిగా తనను నియమించగా ఇంతటి విజయవంతం కావడం సంతోషదాయకమన్నారు. జనసేన, తెలుగుదేశం పొత్తు అధికారం కోసం కాదని ప్రజలకు మంచి పాలన అందించేందుకేనని అన్నారు. అభివృద్ధి మరిచి పర్సెంటేజ్ ల కోసం వివిధ రకాల పథకాల వాహనాలను కొనుగోలు చేశారు తప్ప వాటికి తగిన సిబ్బందిని నియమించలేకపోయారని విమర్శించారు. ఈ నాలుగున్నర ఏళ్ల వైసిపి పాలన అంతా దోచుకోవటం ఎలా అనే దానిపైనే సాగిందన్నారు. యువగళం పాదయాత్ర ముగింపు సభను జయప్రదం చేసిన కనిగిరి ప్రాంత మరియు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి వచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక సమయం వంద రోజులు మాత్రమే ఉందని తెలుగుదేశం పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడేలా కష్టి చేయాలని కోరారు.

టిడిపి ఓట్ల తొలగింపు చర్యపై ఈసీకి ఫిర్యాదు

వైసిపి ఓటమి భయంతో తెలుగుదేశం పార్టీ ఓట్లను తొలగించే దుర్మార్గపు చర్యకు పాల్పడుతుందని, ఈ అక్రమంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలోని పిసిపల్లి మండలం గుదేవారి పాలెం లో 230 తెలుగుదేశం ఓట్లను తొలగించే చర్యకు వైసిపి పూనుకుందన్నారు. తాము అప్రమత్తమై అడ్డుకోవడం జరిగిందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవలసిన అధికారులు ఓటర్లపై బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎవరి ఓటును వారే తొలగించుకునేలా దరఖాస్తు చేసినట్లు సృష్టించారని ఈ విషయమై ఆర్డీవోకు ఫిర్యాదు చేయడంతో ఓట్ల తొలగింపు నిలిచిందన్నారు. ఇదేవిధంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తెలుగుదేశం ఓట్ల తొలగింపు పాల్పడుతున్నట్లు తెలుస్తోందని, దీనిపై తాము నిఘా పెట్టామని, ఓట్ల తొలగింపునకు పాల్పడితే సహించేది లేదని అన్నారు. ఇదే తంతు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని ఎన్నికల కమిషన్ దష్టికి తీసుకుపోయి అక్రమానికి పాల్పడుతున్న వారికి శిక్షపడేలా పోరాడుతామన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కొండమల్ల శ్రీనివాసరెడ్డి, వివిఆర్ మనోహర్రావు, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, బుల్ల బాబు, చింతలపూడి తిరుపాలు, పిచ్చల శ్రీనివాసరెడ్డి, కరణం అరుణ, గుడిపాటి ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర' శిక్ష ఉద్యోగుల నిరసన

కళ్లకు గంతలు కట్టుకొని

ప్రజాశక్తి-బాపట్ల

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బాపట్లలో నాలుగో రోజుకు చేరింది. శనివారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం అమలు చేసే వరకు దీక్ష విరమించేది లేదని లేదని నినాదాలు చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల నాలుగో రోజు దీక్షకు యుటిఎఫ్ బాపట్ల జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు సంఘీభావం తెలిపి.. మాట్లాడారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను ప్రభుత్వం తక్షణమే రెగ్యులర్ చేసి.. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని కోరారు. బాపట్ల జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షులు డి. ప్రసాదరావు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల బాపట్ల జిల్లా అధ్యక్షులు టి. మాణిక్యరావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, యుటిఎఫ్ మండల శాఖ నాయకులు మద్దాల డేవిడ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్‌గఫార్

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్‌గఫార్

ప్రజాశక్తి -కనిగిరి

కరోనా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ సూచించారు. శనివారం కనిగిరి డివిజన్ కేంద్రంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ ఆఫీస్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మళ్లీ విజంభిస్తోందన్నారు. రెండు వేరియంట్లకు మించి ప్రమాదకరంగా మూడో వేరియంట్ వస్తున్నదని తాజాగా జేఎన్-1 ఉపరకం పేరుతో కరోనా వేగంగా వ్యాప్తి చెందుతోందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో.. వైరస్ సోకుండా జాగ్రత్తలు పాటించడం కష్టమేమీ కాదని వయసు పైబడిన వాళ్లు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవాళ్లు, పిల్లలు, మరీ ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు మాస్కులు ధరించడం మంచిదని సూచించారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ సజన మాట్లాడుతూ జేఎన్-1 వేరియంట్‌తో ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సీజన్‌లో అయ్యప్ప మాలలు, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండుగ, వివిధ రకాల జాతరలు రానుండడంతో వైరస్ మరింత విస్తరించే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించడంతో పాటు శానిటైజర్లు వాడాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు చేసేందుకు కిట్లతోపాటు శానిటైజర్లు, మాస్కులు అందుబాటులో ఉంచేలా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తోందని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ ఉన్నవారు తగిన జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే తప్ప బయటకి రాకూడదని తెలిపారు. ముఖ్యంగా టీబీ, ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు తప్పకుండా మాస్కులు ధరించాలన్నారు. ఏ క్షణమైనా నూతన వేరియంట్ వ్యాపించే అవకాశం ఉందన్నారు. రద్దీ ప్రదేశాల్లో సాధ్యమైనంతవరకు తిరుగకుండా ఉండాలన్నారు. జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, జిఎస్ అండ్ జిడికె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాస్ హార్ట్‌కేర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు

ఉపాస్ హార్ట్‌కేర్ సెంటర్‌ను ఒంగోలు, సంతపేటలోని పాత రాజమ్మ హాస్పిటల్ కాంపౌండ్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ గోనుగుంట్ల ఉమాపతిచౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ కాప అనిల్‌కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథులుగా కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్‌పి మల్లికాగర్గ్, మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డిఎంహెచ్‌ఒ ఎం.రాజ్యలక్ష్మి పాల్గొంటారని తెలిపారు.

'పిడతల' ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-రాచర్ల

మండలంలోని అనుమలవీడు గ్రామంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా సీతారామస్వామి దేవస్థానానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా పిడతల రాంభూపాల్‌రెడ్డి , పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఈ ఆలయానికి ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

అంగన్‌వాడీల ఘోష పట్టదా?

గ్రామాల్లో కొద్దిపాటి గౌరవ వేతనాలతో పిల్లలకు, తల్లులకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆలనాపాలనా చూసుకునే అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్దయగా ఉంది. న్యాయమైన డిమాండ్ కోసం చివరికి సమ్మెకు దిగాల్సి వచ్చింది. ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీని అమలుచేయాలనే ఇప్పుడు అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారు. తెలంగాణలో కన్నా వెయ్యి రూపాయలు అదనంగా వేతనం ఇస్తామని ప్రకటించారు. దీన్ని అమలుచేయాలని పలుసార్లు మొరపెట్టుకున్నారు. ఎన్నోసార్లు శాంతియుతంగా ధర్నాలు చేశారు. మళ్లీ ఎన్నికలు వస్తున్నా దిక్కులేదు. దీంతో అనివార్యంగా సమ్మెకు దిగారు. ఇప్పటికే 12 రోజులైంది. ఇళ్లూవాకిళ్లూ వదిలి కార్యాలయాల వద్దనే రాత్రింబవళ్లు గడుపుతున్నారు. వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. మానవహారాలు నిర్వహిస్తున్నారు. భిక్షాటన చేశారు. దీక్షలు చేపట్టారు. రాస్తోరోకోలు చేశారు. మధ్యలో అధికారులు, వాలంటీర్లు కలిసి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టారు. వాటిని నిర్వహించడం వారి వల్ల కాలేదు. పిల్లలు, తల్లులు కూడా వచ్చి మద్దతుగా ఆందోళనల్లో పాల్గొన్నారు. అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయి. జగన్ ఇచ్చిన హామీ అమలుచేయాలనే ఏకైక డిమాండ్ న్యాయబద్ధంగానే ఉందనే చర్చ జనంలోనూ ఉంది. అయితే ఇప్పుడు సిఎం జగన్ ఎవరి గోడూ వినే స్థితిలో లేరు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ కదా? చాలా రోజులు గడిచినందున మరిచిపోతారనుకున్నారేమో ఇప్పటికీ వారి సంగతే ఆలోచించలేదు. వారి ఘోష ఆయనకు వినిపించలేదా? వినిపించినా పెడచెవిన పెట్టారా? అన్నది చూడాలి. వాస్తవంగా అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిన్నచూపే.. వేతనాలు తప్ప ఏమైనా చేస్తామంటూ సమ్మె విరమించాలని కోరుతున్నారు. అసలు సమ్మె చేస్తుందే దానికోసమైతే దాన్ని వదిలేసి సమ్మె విరమిస్తే ఉపయోగం ఏముందని అంగన్‌వాడీలు ప్రశ్నిస్తున్నారు. ఇదే తీరున రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తే రేపు జరగబోవు ఎన్నికల్లో వీళ్ల ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వైసిపి నేతలు ఆలోచించుకోవాలి. ఇంకా అనేకరంగాల ఉద్యోగ, కార్మికులు ఆందోళనలు చేపడుతున్నారు.

వైసిపి రాజకీయ మార్పులు వికటిస్తున్నాయి. ఇద్దరు మంత్రులకు స్థానభ్రంశం కల్పించారు. వారికి కేటాయించిన నియోజకవర్గాల్లో పరిస్థితులు చక్కపడలేదు. ఆదిమూలపు సురేష్ కొండపిలో అడుగుపెట్టారు. ఆయన బలవంతంగానే అక్కడకు వెళ్లారు. సిఎం జగన్ పుట్టినరోజు పేరుతో నియోజకవర్గాల్లో కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేశారు. సంతనూతలపాడులో ఇన్‌ఛార్జి మంత్రికి చుక్కెదురైంది. స్థానిక నేతలు తిరుగుబాటు చేశారు. బాలినేని పాత్ర లేకుండా ఇక్కడ నిర్ణయాలు తీసుకుంటే అమలు చేయబోమన్నారు. దీంతో ఆయన అక్కడ అడుగుపెట్టడం సవాలుగా మారింది. అద్దంకిలో ఇన్‌ఛార్జిగా హనిమిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. పార్టీ అగ్రనేతల్లో ఒకరైన వై.వి.సుబ్బారెడ్డిని వెంటపెట్టుకొని నియోజకవర్గంలో అడుగుపెట్టారు. మాజీ ఇన్‌ఛార్జి బాచిన చైతన్య గ్రూపు దూరంగా ఉంది. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. రెండు గ్రూపులుగానే చీలిపోతున్నారు. తప్పించిన నేతలు అసంతృప్తితో పార్టీకార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు కూడా అధినేత తీరుపై అసంతృప్తిగానే ఉన్నారు. మార్పులు ఎటు దారితీస్తాయోనన్న ఉత్కంఠ కూడా నెలకొంది. ఇక సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి జోక్యం తగ్గడంతో పాటు ఆయనకూ అధిష్ఠానం ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆయన కూడా అసంతృప్తిగానే ఉన్నారు. ఒంగోలును వీడి హైదరాబాద్‌లోనే ఉన్నారు. రాజకీయంగా పార్టీలో సమన్వయం లేదు. నేతల మధ్య ఐక్యత లేదు. ఏకాభిప్రాయం కనిపించడం లేదు. జిల్లాలో పలువురు సీనియర్ నేతలు కూడా వైసిపిలో చేరినందుకు తలలు పట్టుకుంటున్నారు. కనీసం సిఎం జగన్‌ను కలిసే అవకాశం కూడా సీనియర్ రాజకీయనేతలకు రావడం లేదు. టికెట్టు కోసం జూనియర్లతో పాటే క్యూలో నిలుచోవాల్సిన రిస్థితి వచ్చింది. బయటకు చెప్పలేక..సతమతమవుతున్నారు. మరోవైపు తెలుగుదేశం నేతలు నియోజకవర్గాల్లో జనసేనతో కలిసి ముమ్మరంగా కార్యక్రమాల్లో ఉంటున్నారు. రాజకీయంగా నియోజకవర్గాల్లో వేడి పెరుగుతోంది. ఎన్నికల వాతావరణం వచ్చేసింది.

తుపానుకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం ప్రశ్నార్థకంగా మారింది. నష్టాలను అంచనా వేస్తున్నారు. ఇంకా ప్రక్రియ పూర్తయిందా? లేదా అంటే ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలతోనే అధికారులకు ముందుకుపోవాల్సి పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో 60వేల హెక్టార్లలో వివిధ పంటలు పోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే ఇంతవరకూ రైతులను ఆదుకునే చర్యలు ఏమిటన్నదీ స్పష్టత లేదు. పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రతిరైతును ఆదుకుంటామని ప్రకటించిన సిఎం జగన్ ఆచరణలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.